

నేడు గురుకులాల ప్రవేశ పరీక్ష

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అన్ని యాజమాన్యాల గురుకుల విద్యాసంస్థల్లో ఐదో తరగతిలో ప్రవేశాలు, 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న బ్యాక్‌లాగ్ సీట్లకు ఈ నెల నేడు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు బీసీ గురుకులాల ఆర్‌సీవో గౌతంకుమార్ రెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 23 కేంద్రాల్లో సుమారు 8,222 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని వెల్లడించారు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులు ఉదయం 9.30 గంటల వరకు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్

- ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక వాహనం
- స్పాట్‌లోనే ఆహార నాణ్యత నిర్ధారణ
- కల్తీకు చెక్.. ఆరోగ్యానికి భరోసా

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో నాణ్యత లేని ఆహార ముడి పదార్థాలు, ఆహార పదార్థాల్లో ఏదో ఒక రూపంలో కల్తీ జరుగుతున్నది. ఈ విషయం ఇటీవల అధికారులు చేపట్టిన తనిఖీల్లో వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఓ వైపు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ నేపథ్యంలో ఆహార నాణ్యత విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగా ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ పేరిట మొబైల్ వ్యాన్లను రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం కేటాయించింది. మెదక్‌కు కేటాయించిన వాహనం శనివారం సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకున్నది. ఈ వ్యాన్‌లో అక్కడికక్కడే ఆహార నాణ్యత నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. హానికరం, నకిలీ, నాసిరకం ఇలా మూడు రకాల ప్రమాణాలపై పరీక్షలు జరుపుతారు. కల్తీ ఉన్నట్లు గుర్తిస్తే అవగాహన, చైతన్యం కలిగించి ముందస్తుగా హెచ్చరికలు జారీ చేస్తారు. మరో సారి పునరావృతమైతే శాంపిళ్లు సేకరించి నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపి వచ్చిన ఫలితాల ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జరిమానాలు విధిస్తారు.



సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చేరుకున్న ఫుడ్ సేఫ్టీ వాహనం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం సంగారెడ్డి నియోజకవర్గ
ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

హాజరైన మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే, ఎన్నికల ఇన్‌చార్జి వాకిటి శ్రీహరి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, ఎన్నికల పరిశీలకులు చల్లా నర్సారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి సమీపంలోని మల్కాపూర్ శ్రీవెంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో శనివారం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే, ఎన్నికల ఇన్‌చార్జి వాకిటి శ్రీహరి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల, ఎన్నికల పరిశీలకులు చల్లా నర్సారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఆయనకు మెజార్టీ వచ్చేలా చూడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, మార్కెట్ కమిటీ చైర్మన్లు రాంచందర్‌నాయక్, కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్, నాయకులు తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్, మహేశ్, నవత్ నాగరాజ్, సోహైల్, కసిని రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఇన్‌చార్జి వాకిటి శ్రీహరి, పక్కన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హాజరైన మంత్రులు దామోదర, కొండా సురేఖ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, పరిశీలకులు చల్లా నర్సారెడ్డి, అభ్యర్థి నరేందర్‌రెడ్డి

రైతుల 'పూల'బాట



రుక్మాపూర్‌లో సాగు చేస్తున్న బంతిపూల తోట

- కూరగాయల ధరల్లో హెచ్చుతగ్గులతో నష్టాలు
- ప్రత్యామ్నాయంగా పూల తోటల సాగు
- నష్టాలు అధిగమించి లాభాల బాటలోకి..
- పండుగలు, వివాహాల సీజన్లలో అధిక లాభాలు
- ఆదర్శంగా నిలుస్తున్న రుక్మాపూర్ రైతులు

సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఇన్నాళ్లు కూరగాయల పంటలను సాగుచేస్తున్న రైతులు ఇప్పుడు రూటు మార్చారు. కూరగాయల ధరల్లో హెచ్చుతగ్గుల కారణంగా నష్టాలు వస్తుండటంతో పూలతోటల వైపు మొగ్గు చూపుతున్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామ రైతులు పూల సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

Sunday Special

తూప్రాన్/చేగుంట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో మహిళలకు ఇందిరా క్రాంతిపథం (ఐకేపీ) కింద కూరగాయల సాగుకు రుణాలు అందజేశారు. రుణాలు పొందిన రైతులు కూరగాయల సాగు చేపట్టగా మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో నష్టాలు చవిచూశారు. నష్టాలను అధిగమించడానికి పాడిగేదెల పెంపకం చేపట్టినా ఆశించిన రీతిలో లాభాలు సాధించలేకపోయారు. దీంతో వారు పూల తోటలను సాగు చేస్తున్నారు. బంతి, చామంతి, కనకాంబరాల తోటలు సాగు చేస్తూ లాభాల బాటపట్టారు.

విత్తనాలు.. నారు కొనుగోలు ఇలా..

అర ఎకరం బంతిపూల తోటల సాగు చేసేందుకు రూ. 20వేల వరకు ఖర్చవుతుందని రైతులు పేర్కొంటున్నారు. బంతిపూలు వెయ్యి విత్తనాల ప్యాకెట్ రూ. 2వేలకు కొనుగోలు చేస్తున్నారు. అర ఎకరం సాగు చేసేందుకు ఐదు పాకెట్లను కొనుగోలుచేసి నర్సరీల పెంపకందారులకు అందజేస్తున్నారు. ఇందుకోసం నర్సరీల నిర్వాహకులకు రూ. 5వేలు చెల్లిస్తున్నారు. ఎరువులు, కూలీలకు మరో రూ.5వేలు వెచ్చిస్తున్నారు. సీజన్‌ను బట్టి బంతిపూలు కిలో రూ. 60 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తున్నారు. కనకాంబరాల తోటల సాగుకు మొక్కలు, ఎరువులు, కూలీలకు కలుపుకొని ఎకరాకు సుమారు రూ. 15వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఒక్కో మొక్కకు రూ. 0.60 పైసలు చెల్లించి నర్సరీల్లో కొనుగోలు చేస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో కనకాంబరాల సాగుకు 1,600 వరకు మొక్కలు అవసరమవుతాయి. చామంతి పూల తోటల సాగుకు సైతం దాదాపు

మిగతా 8వ పేజీలో..

సూర్య ప్రతాపం



- శివరాత్రికి ముందే భగభగ
- ఉమ్మడి మెదక్ జిల్లాలో పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు
- నర్సాపూర్‌లో అత్యధికంగా 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
- ఎల్లో అలర్ట్ జారీ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సంక్రాతికి చలి గజగజా వణికిస్తుందని.. శివరాత్రికి శివ.. శివా.. అంటూ వెళ్లిపోతుందని పెద్దలు అంటుంటారు. కానీ శివరాత్రికి ముందే ఎండలు ముదురుతున్నాయి. రాత్రిపూట చలి ఇంకా తగ్గనే లేదు.. పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటలకే సుర్రుమంటున్నాడు. కరెంట్‌పోతే ఇళ్లలో ఉక్కపోత తప్పడం లేదు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఎండాకాలం ఎలా గడుస్తుందో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. మెదక్ జిల్లాలో శనివారం అత్యధికంగా 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలకు కీలక సూచనలు చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఎండ వేడిమి ఎక్కువైందని, ఉక్కపోత మొదలైందని వాతావరణం పూర్తిగా పొడిబారడంతో మధ్యాహ్నం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నది. మార్చి 1 అనంతరం మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా..

మెదక్ జిల్లా నర్సాపూర్, దామరంచ, వెల్దుర్తిలో 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొల్చారంలో 38, పాపన్నపేట 37.8, కొడిపల్లి 37.7, మెదక్ 37.5, టేక్మాల్ 37.4 డిగ్రీలుగా నమోదైంది. సిద్దిపేట జిల్లాకేంద్రంలో 37.7, చేర్యాల 37.2, అక్కన్నపేట 37.1, సంగారెడ్డి జిల్లా అందోల్ 36.7, కోహీర్ 36.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆరోగ్యం జాగ్రత్త

పగలు ఎండల తీవ్రత.. రాత్రి చలి ప్రభావంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. సీజన్ మారుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఇందుకు తగినట్లే జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతూ ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య పెరుగుతున్నదని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు దోమల బెడద కూడా పెరుగుతున్నది. ఈ సమయంలో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



జోరుగా.. హుషారుగా..

- కంది ఐఐటీహెచ్‌లో కల్చరల్ ఫెస్ట్
- బీవీఆర్ఐటీలో ఈ-వాహనాల జోరు

7

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

- మెదక్ జిల్లాలో 21 పోలింగ్ కేంద్రాలు
- ఏడుపాయల జాతరకు భద్రత
- ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

8



విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలి

సిబ్బందికి సంగారెడ్డి, సిద్దిపేట కలెక్టర్ల ఆదేశం

8

స్తంభాన్ని ఢీకొట్టిన ఎక్స్‌కవేటర్

● త్రుటిలో తప్పిన ప్రమాదం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండలం పెద్ద ముభారక్‌పూర్‌లో శనివారం ఎక్స్‌కవేటర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో, స్తంభం విరిగి పెను ప్రమాదం తప్పింది. ఎక్స్‌కవేటర్‌తో చెట్లను తొలగించే పనులు చేస్తున్న క్రమంలో స్తంభానికి బకెట్ తగలడంతో స్తంభం విరిగింది. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఓటర్లకు స్లిప్పులు అందజేస్తాం

నర్సాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ పట్టభద్రులు, టీచర్ స్థానాలకు ఓటు వేసే ఓటర్లకు సిబ్బంది ఇంటింటికి వెళ్లి స్లిప్పులు అందజేస్తారని తహసీల్దార్ కే.శ్రీనివాస్ తెలిపారు. శనివారం నర్సాపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పట్టభద్రులు స్థానానికి 923 మంది ఓటర్లు ఉండగా.. టీచర్ స్థానానికి 145 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. నర్సాపూర్‌లోని జూనియర్ కాలేజీలో పట్టభద్రులకు, టీచర్ స్థానానికి వేరువేరుగా పోలింగు కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

జిన్నారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పార్యానగర్‌లో డంపుయార్డుకు వ్యతిరేకంగా 18వ రోజు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. శనివారం కొత్తపల్లిలో జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను జరిపి డంపుయార్డు ఏర్పాటును రద్దు చేసే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు.

పొగాకు ఉత్పత్తులను నిషేధించాలి

కల్హేర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాంతకంగా మారిన పొగాకు ఉత్పత్తులను తక్షణమే నిషేధించాలని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా పర్యవేక్షకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా మండల కేంద్రమైన కల్హేర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాజాసింగ్, కళాశాల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థులు పట్టుదలతో చదవాలి'

నంగునూరు/మద్దూరు, ఫిబ్రవరి 22 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివేతే అనుకున్న లక్ష్యం సాధించవచ్చు అని నంగునూరు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ అన్నారు. శనివారం అక్కేనాపల్లి మోడల్ స్కూల్‌లో పదవతరగతి, ఇంటర్ విద్యార్థులకు , మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వీడ్కోలు సమావేశం న్విహించారు. అక్కేనాపల్లి మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రామస్వామిగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



మద్దూరు : సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన ఉడెం మల్లారెడ్డి (55) పని మీద సిద్దిపేటకు వెళ్లి, తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన మల్లారెడ్డిని స్థానికులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చనిపయాడు. కుమారుడు ఉడెం రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

రామయంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రోజులాగే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడి కన్నుమూశాడు. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఖానాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిగౌడ్(48) రోజులాగే కల్లు గీసేందుకు శనివారం సాయంత్రం తాటిచెట్టు పైకి ఎక్కాడు. కల్లు గీస్తుండగా, కాలు జారి కింద పడటంతో తలకు బలమైన గాయం అయింది. అక్కడున్న వారు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సాయిగౌడ్‌కు భార్య సావిత్రి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


ప్రదీప్ (ఫైల్)

నిజాంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 'నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. పిల్లలు జాగ్రత్త' అంటూ భార్యకు ఫోన్ చేసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మండల పరిధిలోని నంది గామ గ్రామానికి చెందిన చెర్ల ప్రదీప్(35) కొంత కాలం క్రితం అనారోగ్యానికి గురికాగా, చికిత్స నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులు తీరే మార్గం కనిపించక జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరి లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. అతని భార్య యేసుమణి తల్లిగారింటికి వెళ్లగా, శుక్రవారం రాత్రి ఫోన్ చేసి 'పిల్లలను జాగ్రత్తగా చూసుకో.. అప్పులు తీరే మార్గం లేక నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని చెప్పాడు. ఆమె వచ్చి చూసేలోగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక స్థితి సరిగ్గా లేక..

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి సరిగ్గా లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మార్కంటి పోచయ్య (61)కు ఏడాది మానసిక ఆరోగ్యం సరిగ్గా లేదు. ఇటీవల అతని చిన్న కుమారుడు మహేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో కుటుంబ సభ్యులంతా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేనిది చూసిన పోచయ్య శుక్రవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత దాడిలో గేదె మృతి

రామాయంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిరుత మరోసారి దాడి చేసి ఓ గేదెను చంపి తిన్నది. ఈ ఘటన రామాయంపేట మున్సిపల్ పరిధి కొయ్యగుట్ట శివారులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. గుల్పర్తి గ్రామానికి చెందిన కాషాల స్వామి శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే తన వ్యవసాయ భూముల వద్ద పశువులకు మేత వేసి ఇంటికి వచ్చాడు. శనివారం పొలాని వెళ్లి చూడగా, గేదె చనిపోయి ఉంది. చిరుత చంపిందని భావించి వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారం క్రితమే ఇదే మండలం లక్ష్మాపూర్‌లోనూ చిరుత ఓ ఆవును చంపేసింది. చిరుత వరుస దాడులకు పాల్పడుతుండటంతో రామాయంపేట ప్రాంత ప్రజలు భయాందోళలకు గురవుతున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్


ఇసుక డంపు వద్ద పోలీసులు

ధూళిమిట్ట, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : అక్రమ ఇసుక డంపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన తుపాకుల శ్రీను, పోతన యాదగిరి మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలించి ఓ ఖాళీ స్థలంలో నిల్వ చేశారు. శనివారం రెవెన్యూ, పోలీస్ అధికారులు ఆ ఇసుకను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై షేక్ మహబూబ్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

పట్టా మార్పిడి చేయాలని మృతదేహంతో ఆందోళన

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టా మార్పిడి చేయాలని బాబాయి మృతదేహంతో కుమారుడి ఇంటి ఎదుట కుటుంబసభ్యులు ఆందోళన నిర్వహించిన సంఘటన జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్‌కు చెందిన కొత్త మల్లారెడ్డికి ఎకరం వ్యవసాయ భూమి ఉన్నది. తన అన్న కుమారుడు అగు నరసింహారెడ్డి పేరుపైన రికార్డుల్లో పట్టా చూయిస్తున్నది. నరసింహారెడ్డికి సంబంధించిన భూమి మల్లారెడ్డి, ఆయన కుమారుల పేరుపైనా చూపిస్తున్నది. ఆ భూమి కాళేశ్వరం ప్రాజెక్టు కాలువ భూసేకరణలో పోయింది. ఆ డబ్బు మల్లారెడ్డి, ఆయన కుమారులైన రంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డికి ప్రభుత్వం చెల్లించింది. డబ్బు తనకు ఇస్తే తన పేరు మీద ఉన్న భూమి మీకు చేస్తానని నరసింహారెడ్డి మొండికేసాడు. నరసింహారెడ్డి పేరుపై ఉన్న పట్టా భూమి కబ్జాలో మాత్రం మల్లారెడ్డి కుమారులు ఉంటూ భూమిని సాగు చేస్తున్నారు. ఇద్దరి మధ్య కొన్నేళ్లుగా ఈ భూపంచాయతీ కొనసాగుతుంది. కాగా శనివారం మల్లారెడ్డి(70) మృతిచెందగా మల్లారెడ్డి కుమారులు మృతదేహాన్ని నరసింహారెడ్డి ఇంటి ఎదుట ఉంచి, భూమిని తమ పేరిట మార్పిడి చేయాలని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ ఘటన స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను సముదాయించారు. చివరికి భూమిని పట్టా మార్పిడి చేస్తానని నరసింహారెడ్డి చెప్పడంతో నిరసన విరమించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థులతో వంటలు.. ఇద్దరి ఉపాధ్యాయుల సస్పెన్షన్

కంగ్టి, ఫిబ్రవరి 22, (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంగ్టి ట్రైబల్ వెల్ఫేర్ విద్యాలయంలో విద్యార్థులతో వంటలు చేయించిన ఇద్దరి ఉపాధ్యాయులను కలెక్టర్ వల్లూరు క్రాంతి సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులతో వంటలు చేయించారని ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తిని విచారించాలని ఆదేశించారు. ఆర్డీవో నివేదిక ఆధారంగా వాస్తవమేనని తేలడంతో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.మహేశ్, టీజీటీ ఉపాధ్యాయుడు శివకుమార్‌ను సస్పెండ్ చేశారు.

జోరుగా.. హుషారుగా..

సంగారెడ్డి జిల్లా విద్యార్థుల ప్రతిభను వెలికితీసే కార్యక్రమాలకు వేదికగా మారింది. కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో నిర్వహిస్తున్న ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్‌లో రెండో రోజు విద్యార్థులు పలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నర్సాపూర్ పరిధి బీవీఆర్‌ఐటీలో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీల్లో మహిళా టీంలు ఈ-కార్లను పరుగులు పెట్టించారు.

బీవీఆర్ఐటీలో ఈ-వాహనాల హోరు

నర్సాపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ఐటీలో జరుగుతున్న జాతీయ స్థాయి ఈ- బాజా సే ఇండియా పోటీలు శనివారం మూడో రోజు జోరుగా సాగాయి. కార్యక్రమానికి మారుతీ సుజుకీ టెక్నాలజీ ఆఫీసర్ సీవీ రామన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మెకానికల్, ఎలక్ట్రికల్ ఎవాల్యుయేషన్ పద్ధతులను పరిశీలించి విద్యార్థులు పలు సూచనలు చేశారు. విద్యార్థులు రూపొందించిన వాహనాలను పరిశీలించారు. పోటీల్లో భాగంగా మహిళా టీంలకు ప్రత్యేకంగా ఈ-కార్ రేసింగ్ నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులకు మార్గదర్శకంగా వ్యవహరించిన అధ్యాపకుడిని ఎంపిక చేసి, ద్రోణాచార్య అవార్డు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


ట్రాక్‌పై సిద్ధంగా ఉన్న ఈ-బగ్గీ


ఆర్ట్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

కంది ఐఐటీహెచ్‌లో కల్చరల్ ఫెస్ట్

కంది, ఫిబ్రవరి 22: సంగారెడ్డి జిల్లా కంది శివారులోని ఐఐటీ హైదరాబాద్‌లో ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్ వేడుకలు శనివారం ఉత్సాహంగా కొనసాగాయి. ఐఐటీహెచ్ ఆడిటోరింలో సంగీత కచేరీలో శాస్త్రీయ వాయిద్యాల నడుమ వినసొంపుగా పాటలు పాడి అలరించారు. ఐఐటీహెచ్ లెక్చరల్ హాల్‌లో బ్రేక్ ఫ్రీ డ్యాన్స్ షోలో విదార్థినులు నృత్యాలు చేసి అదరగొట్టాయి. ఆర్కేడ్ గేమ్స్‌లో భాగంగా మట్టితో చేసిన ఆకృతుల పోటీ, పెయింటింగ్ కలర్ బాల్స్ షో, బుల్‌ఫైట్ గేమ్ షో నిర్వహించారు. అలాగే, ఆర్ట్ వర్క్‌షాప్ కాంపిటీషన్‌లో పోటీలు, కలర్‌మిక్స్ పెయింటింగ్ పోటీలకు విద్యార్థులు ఎక్కువగా మక్కువ చూపారు. ఈ సారి పోటీల్లో గెలిచిన వారికి రూ.6 లక్షల విలువైన బహుమతులను అందజేయనున్నట్లు ఐఐటీహెచ్ వర్గాలు తెలిపాయి.


ఐఐటీహెచ్‌లో ఎలాన్ ఎన్‌విజన్ టెక్నో కల్చరల్ ఫెస్ట్ వేడుకల్లో పెయింటింగ్ కలర్‌బాల్స్ షోలో పోటీ పడుతున్న విద్యార్థులు

తోర్నాల స్తూపం కనుమరుగు

జాతీయ రహదారి విస్తరణలో కూల్చివేత
ఇప్పటికే ఓసారి అడ్డుకున్న గ్రామస్థులు
గ్రామానికి ప్రత్యేక గుర్తింపు


గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌లో అమరులైన పీపుల్స్‌వార్ నాయకులు (ఫైల్)


తోర్నాల వద్ద అమరవీరుల స్మారక స్తూపం

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సుమారు మూడు దశాబ్దాల పాటు చెక్కుచెదరకుండా.. అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ ఠీవీగా నిలిచిన స్తూపం ఇప్పుడు కనుమరుగు కానుంది. ప్రభుత్వం అన్ని స్తూపాలనూ కూల్చి వేస్తున్న సమయంలోనూ గ్రామస్థులు మూకుమ్మడిగా అడ్డుకుని నిలబెట్టుకున్న ఆ స్మారకం రోడ్డు విస్తరణలో భాగంగా ఉనికిని కోల్పోనుంది. మెదక్- ఎల్కతుర్తి వయా సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మూడు దశాబ్దాల చరిత్ర ఉన్న తోర్నాల స్తూపాన్ని తొలగించాలని నిర్ణయించడంతో గ్రామస్థుల్లో ఆందోళన మొదలైంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆర్ అండ్ బీ అధికారులు ఈ స్తూపాన్ని ఇప్పటికే ఓసారి తొలగించే ప్రయత్నం చేయగా, గ్రామస్థులు అడ్డుకున్నారు.

గిరియిపల్లి మృతుల స్మారకార్థం..

1979లో జరిగిన గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌లో నాటి పీపుల్స్‌వార్ నాయకులు మాదవనేని జనార్దన్‌రావు, కొలిశెట్టి ఆనందరావు, లంకా మురళీమోహన్, వనపర్తి సుధాకర్‌లు అసువులు బాసారు. వారి స్మారకార్థం 1989లో మెదక్-సిద్దిపేట రహదారి పక్కన తోర్నాల వద్ద అప్పటి దళ ఆర్గనైజర్ రామన్న నేతృత్వంలో గ్రామస్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిర్మించారు. ఆ తర్వాత ప్రభుత్వ నిర్ణయం మేరకు ఉమ్మడి జిల్లాలో నక్సల్స్ నేతల స్మారకంగా నిర్మించిన పలు స్థూపాలను కూల్చి వేశారు. తోర్నాల స్తూపాన్ని పోలీసులు ధ్వసం చేసేందుకు ప్రయత్నించగా, ప్రజలంతా అందుకు అడ్డం పడ్డారు. వారి అభీష్టం మేరకు తోర్నాల స్థూపం అమరుల తాగ్యాలకు చిహ్నంగా తోర్నాల రహదారిపై అలా నిలిచిపోయింది.

గ్రామానికి గుర్తింపు..

అమరుల త్యాగాలకు గుర్తుగా ఐక్యంగా, స్వచ్ఛందంగా నిర్మించుకున్న తోర్నాల స్తూపం తమ గ్రామానికి తెలుగు రాష్ట్రాల్లోనే ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని గ్రామస్థులు చెబుతున్నారు. నాటి ఉద్యమ స్మృతులు, త్యాగాలకు ప్రతీకగా నిలిచిన స్తూపాన్ని ఇప్పటికే ఓసారి ధ్వసం చేసే ప్రయత్నం చేసి, విరమించుకున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు రోడ్డు విస్తరణలో భాగంగా స్తూపాన్ని కూల్చేందుకు ఒప్పుకోమని ముక్తకంఠంతో చెబుతున్నారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. అధికారులు, కాంట్రాక్టర్ స్తూపాన్ని పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిర్మిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్థుల ద్వారా సమాచారం.

ఈ విషయమై ఎన్‌హెచ్ డీఈని సంప్రదించగా.. 'స్తూపం విషయంలో అధికారికంగా గ్రామస్థులకు ఎలాంటి హామీ ఇవ్వలేదని, కాంట్రాక్టర్ గ్రామస్థులతో మాట్లాడి ఉండవచ్చని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 'పవర్'

ప్రవర్తనలో మార్పు వచ్చేలా శిక్షణ కార్యక్రమాలు

రెండు విడతల్లో డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లకు ట్రైనింగ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రయాణికులకు మరింత చేరువ చేసి మెరుగైన సేవలందించి ఆదాయాన్ని పెంచడమే కాకుండా ఉద్యోగుల ప్రవర్తనలో మార్పు వచ్చేలా పవర్ (పీక్ పర్ఫార్మెన్స్ త్రూ ఓనర్‌షిప్ విత్ ఎంపతీ రిసాల్వ్) శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తొలి విడత శిక్షణ కార్యక్రమం ఈ నెల 18వ తేదీన ప్రారంభం కాగా 23 వరకు కొనసాగనుంది. మహాశివరాత్రి తర్వాత రెండో విడత నిర్వహించనున్నారు. డిపో మేనేజర్ల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లకు 40-45 మంది చొప్పున శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రహదారి భద్రత, ప్రయాణికుల పట్ల సత్ప్రవర్తన, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, ఆరోగ్యం, ఓనర్‌షిప్, దృఢ సంకల్పం, మానసిక, శారీరకంగా శక్తివంతులను చేయడం తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నారు.

సిబ్బందిలో చైతన్యం తీసుకొచ్చేలా

ఆర్టీసీ సంస్థలో ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించేలా చైతన్యం తీసుకొస్తున్నాం. విధులు నిర్వర్తించే బస్సు నాది, ప్రయాణికులే సంస్థ అనే భావన రావాలనే ఉద్దేశంతో శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. డిపో పరిధిలోని అన్ని విభాగాల సిబ్బందికి రోజూ వీలును బట్టి శిక్షణ ఇస్తున్నాం. శిక్షణతో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఇతర సిబ్బంది ప్రవర్తనలో మార్పు తెచ్చేందుకు ఈ శిక్షణ తరగుతులు దోహదపడనున్నాయి.

- ఉపేందర్, సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్



ఆవాస విద్యాలయం.. పేదలకు వరం

70 మంది విద్యార్థులకు 19 ఏళ్లుగా ఉచిత విద్య, వసతి

నేడు ఆవాసం 19వ వార్షికోత్సవం


వ్యవస్థాపకుడు కృష్ణారెడ్డి

రామాయంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఓ ఉద్యోగి సేవాగుణం.. నిరుపేద విద్యార్థులకు ఆసరాగా నిలుస్తోంది. ఉచిత చదువుతో పాటు ఆశ్రయం కల్పిస్తోంది. మొదట్లో ఎకరం స్థలాన్ని అప్పట్లో దాతల సాయంతో కొనుగోలు చేసి శిశుమందిర్ నెలకొల్పారు. ఇప్పుడు అదే భవనాన్ని ఆనుకుని మరొకటి నిర్మించి నాలుగు నుంచి పదో తరగతి పిల్లలకు అనుకూలంగా వసతులు కల్పిస్తున్నది రామాయంపేటలోని ఆవాస విద్యాలయం. 19 ఏళ్లుగా దాతల విరాళాలతో ఇక్కడ విద్యనందిస్తున్నారు. ఇక్కడ విద్య అభ్యసించిన పలువురు ఇప్పుడు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అప్పట్లో విద్యుత్ అధికారి కృష్ణారెడ్డి ఉదారత భావంతో ఈ విద్యాలయం స్థాపించబడింది. నేడు 70 మంది పేద కుటుంబాల పిల్లలకు ఉచిత విద్య, వసతి సౌకర్యం అందుతున్నది. ఈ విద్యాలయ 19వ వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు అంతిరెడ్డి విఠల్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్ఎస్ ప్రముఖులు హాజరుకానున్నారు.

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన



ఝరాసంగం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి వారం రోజులు గడుస్తున్నా పట్టించుకోరా అంటూ మండల పరిధిలోని కుప్పానగర్ రైతులు శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడించారు. ఝరాసంగం విద్యుత్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మొక్కజొన్న, అలుగడ్డ పంటలు ఎండిపోతుండగా ప్రైవేటు వెంచర్ యాజమాన్యం కోసం విద్యుత్ సరఫరాను నిలపివేశారంటు ఆరోపించారు. పంటలు ఎండిపోతున్నాయని పలుమార్లు అధికారులతో మొరపెట్టుకున్నా ఏఈ తమ గోడు వినడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు చూసిన విధులకు హాజరుకారని, రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ ఆందోళనలో రైతులు మల్లికార్జున్‌పాటిల్, మాణిక్‌రావు, శివన్న, పాండు, లాలన్న, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీరంగూడకు శివరాత్రి శోభ

● ముస్తాబవుతున్న భ్రమరాంభామల్లికార్జున ఆలయం ● ఐదు లక్షల మంది వస్తారని అంచనా ● ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు


ఆలయ ప్రాంగణంలో సిద్ధమవుతున్న కోనేరు

అమీన్‌పూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం అయిన బీరంగూడలోని భ్రమరాంబామల్లికార్జున ఆలయం ముస్తాబవుతోంది. పండుగ రోజు స్వామి దర్శనానికి ఐదు లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్న పాలకమండలి ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. క్యూలైన్లు, చలువ పందిళ్లు వేస్తున్నారు. నిరంతరం తాగునీటిని సరఫరాకు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి మరుసటి రోజు నిర్వహించే భ్రమరాంబామల్లిఖార్జునస్వామి కల్యాణోత్సవం తిలకించేందుకు మరో లక్ష మంది హాజరుకానున్న నేపథ్యంలో అన్నదానం చేసేందుకు నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణకు అమీన్‌పూర్ మున్సిపాలిటీ వంద మంది సిబ్బందిని నియమించింది. మరికొంత మంది సిబ్బందిని జీహెచ్ఎంసీ నుంచి పిలిపిస్తున్నారు. శివరాత్రి జాగరణ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనల కోసం 15బృందాలు తరలివస్తున్నాయి. రాత్రంతా ఆధ్యాత్మిక సంగీత విభావరి నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి.

భారీ భద్రతా.. పార్కింగ్‌కు ప్రత్యేక రూట్ మ్యాప్

పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నందున గుట్టపై పార్కింగ్ సమస్య తలెత్తకుండా పటాన్‌చెరు సబ్‌డివిజన్ పోలీసులు ప్రత్యేక బందోబస్తుకు ప్రణాళిక సిద్ధం చేశారు. గుట్టపైకి చేరుకునే మూడు ప్రధాన మార్గాలలో ఎక్కడికక్కడ పార్కింగ్ వసతిని ఏర్పాటు చేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా పార్కింగ్ పాయింట్లను సూచిస్తూ రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేశారు. పటాన్‌చెరు డీఎస్పీ ఆధ్వర్యంలో 8మంది సీఐలు, 20మంది ఎస్ఐలతో పాటు 250మంది కానిస్టేబుళ్లను బద్రత కోసం నియమిస్తున్నారు. సంగారెడ్డి, రామచంద్రాపురం, మియాపూర్, సికింద్రాబాద్, మెహదీపట్నం తదితర ఆర్టీసీ డిపోలనుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.

అందుబాటులోకి కోనేరు

సుమారు రూ.30లక్షల వ్యయంతో ఆలయ ఈశాన్యం దిక్కులో ప్రత్యేకంగా నిర్మిస్తున్న కోనేరు ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. అమీన్‌పూర్ మాజీ సర్పంచ్, మాజీ ఆలయ కమిటీ చైర్మెన్ ఏనుగు నర్సింహారెడ్డి నేతృత్వంలో కోనేరు నిర్మాణం తుది దశకు చేరుకుంది. ఆలయ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో కొనసాగుతున్న కోనేరును శివరాత్రికి అందుబాటులోకి తెచ్చేలా రాత్రీపగలు పనులు నిర్వహిస్తున్నారు. కోనేరు మధ్యలో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కోనేరు చుట్టూ సుందరీకరణ పనులు, లైటింగ్, టైల్స్‌వేసే పనులు పూర్తి చేస్తామని ఆయల కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


జాతరలో ఏర్పాటు చేస్తున్న జెయింట్‌వీల్

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు : సుధాకర్‌యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బీరంగూడలోని భ్రమరాంభామల్లికార్జున ఆలయంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మెన్ సుధాకర్‌యాదవ్, ఆలయ ఈవో శశిధర్‌గుప్తలు పేర్కొన్నారు. పదిహేను రోజులుగా ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది శివరాత్రి ఏర్పాట్లపై తలమునకలై పనిచేస్తున్నామన్నారు. కోనేరు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసేందుకు రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసు, హెచ్ఎండబ్ల్యుఎస్, ఆరోగ్యశాఖలతో పాటు అనేక ప్రైవేటు సంస్థలు, దాతలు, ధార్మిక సంఘాలు సహకరిస్తున్నాయన్నారు.

న్యూస్ బాక్స్

మద్యం అమ్మకాలు బంద్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 25 నుంచి 27 వరకు మద్యం అమ్మకాలు నిలిపేయాలని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 135-సీ ప్రకారం పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలను పురస్కరించుకుని 25వ తేదీ సాయంత్రం 4 నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు బార్లు, బెల్టు షాపులు, హోటల్స్‌లో మద్యం విక్రయించొద్దన్నారు. సంగారెడ్డి జిల్లాలోని కొల్లూరు, రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ నిబంధన కొనసాగుతుందని చెప్పారు.

నేడు వీటీజీ సెట్ ప్రవేశ పరీక్ష

మునిపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గురుకులాల్లో 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి నుంచి 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు 23న బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ బోళ్ల మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఉంటుందని, హాల్ టికెట్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8688993022, 9121004525 గల నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నేడు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్

కొల్చారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో నేడు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుందని ప్రిన్సిపాల్ సత్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు 680 మందికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'ఉద్యమాలకు సిద్ధం కావాలి'

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, తిరుపతి అన్నారు. సంగారెడ్డిలో శనివారం చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- జిల్లాలో 21 పోలింగ్ కేంద్రాలు
- ఏడుపాయల జాతరకు భద్రత
- ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మెదక్ జిల్లాలోని 21 పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. బందోబస్తు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల బూత్‌ల వద్ద పరిస్థితుల వివరాలు సేకరించాలని సూచించారు. జిల్లాలోని 21 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 8 రూట్ మొబైల్ పార్టీలు విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డీఎస్పీల ఆధ్వర్యంలో క్యూఆర్‌టీ ఫోర్స్‌లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే మహాశివరాత్రి సందర్భంగా జరుగనున్న ఏడుపాయల జాతరకు పోలీసులు భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. రాత్రి మఫ్టీ, క్యూఆర్టీ, ఫుట్ పెట్రోలింగ్ పార్టీలు బందోబస్తు నిర్వహిస్తాయన్నారు. దొంగతనాలు జరగకుండా నిఘా పెడుతామన్నారు. స్నానపు ఘాట్ల వద్ద అతి ఉత్సాహంతో కొందరు లోతు ప్రదేశాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారని, వారిని హెచ్చరించి ప్రమాదాలను నివారించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ట్రాఫిక్ డైవర్షన్ చేపట్టాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు, ఆనందోత్సవాలతో ఏడుపాయల జాతర జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ మహేందర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలి

- ఎంపీలు రఘునందన్‌రావు, సురేష్‌షెట్కార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీలు రఘునందన్‌రావు, సురేష్‌షెట్కార్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని మెదక్, జహీరాబాద్ ఎంపీలు రఘునందన్ రావు, సురేష్‌షెట్కార్ అన్నారు. సంగారెడ్డిలోని బీఎస్ ఎన్ఎల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అడ్వైజరీ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. బీఎస్ఎన్ఎల్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించడమే కాకుండా మెరుగైన సిగ్నల్ వ్యవస్థను రూపొందించాలని తెలిపారు. దేశంలో బీఎస్ఎన్ఎల్ పూర్తిగా నిర్వీర్యమయ్యే స్థాయికి చేరుకున్న తరుణంలో ప్రధాని మోదీ ఆదుకున్నారని గుర్తుచేశారు. అన్ని నెట్‌వర్క్ వ్యవస్థల్లో 5జీ, 6జీ సేవలందిస్తున్నాయని, కానీ బీఎస్ఎన్ఎల్ ఇంకా 4జీ నెట్‌వర్క్‌లోనే ఉన్నదని 5జీ సేవలందించేలా ముందుకు వెళ్లాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలదించడం వల్ల కస్టమర్ల సంఖ్య పెరిగి అభివృద్ధిలోకి తీసుకురావచ్చన్నారు. అందరు కష్టపడుతూ మెరుగైన నెట్‌వర్క్ వ్యవస్థను అందించాలని వారు సూచించారు. ఈ సమావేశంవలో బీఎస్ఎన్ఎల్ జీఎం రాజేశ్వరి, ఏజీఎ శివప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేయండి

అల్లాదుర్గం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం తాము అప్పుల పాలవుతున్నామని, గ్రామపంచాయతీలకు నిలిచిపోయిన నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌కు గ్రామపంచాయతీ కార్యదర్శులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు ప్రభాకర్, జనార్ధన్, తుక్కారాం ఉన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్పీ


ఎస్‌వీ జూనియర్ కళాశాల ఫేర్‌వెల్‌లో ఎస్పీ చెన్నూరి రూపేష్, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ సూచించారు. సంగారెడ్డి శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఎస్‌వీ జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు సీరియస్‌గా కాకుండా సిన్సియర్‌గా చదువుకోవాలని, మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలు పాడుచేసుకోవద్దని హితవు పలికారు. అలాగే యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాల కృష్ణ మాట్లాడారు. అనంతరం విద్యార్థుల డ్యాన్సులతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవాణాశాఖలో ఏజెంట్ల వ్యవస్థను రద్దు చేయాలి: ఎమ్మార్పీఎస్


బాధితులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రంలోని రవాణాశాఖలో లైసెన్సుల జారీ ఏజెంట్ల వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక మెదక్ జిల్లా అధ్యక్షుడు అస్త్రగళ్ల బాలరాజ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి రవాణాశాఖలో అంతులేని అవినీతి రాజ్యమేలుతోందని, పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆరోపించారు. ప్రైవేట్ వ్యక్తులే అధికారులుగా చలామణి అవుతూ విధులు నిర్వర్తిస్తున్న తీరు బాధాకరమన్నారు. కీలక ఫైళ్లు, లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ కూడా ఏజెంట్ల చేతుల్లో ఉన్నట్టు ఆరోపించారు. అవినీతిని ప్రోత్సహించే కార్యాలయ సిబ్బందిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు సంజీవులు, ప్రశాంత్, ప్రభాకర్, శేఖర్, నర్సింహులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు

తూప్రాన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో శనివారం క్షయవ్యాధి నిర్ధారణకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. తూప్రాన్ మండలంలో 100 రోజుల కార్యక్రమంగా క్షయ వ్యాధిగ్రస్తుల నిర్ధారణకు అనుమానితుల గుర్తింపు కార్యక్రమం చేపట్టారు. క్షయవ్యాధి అనుమానితులకు స్క్రీనింగ్ నిర్వహించారు. శనివారం తూప్రాన్ పట్టణ మున్సిపాల్ కార్యాలయంలో ప్రత్యేక శిబిరం నిర్వహించి, అనుమానితులు 149 మందికి స్కానింగ్ నిర్వహించారు.

మతిస్థితిమితం లేని వ్యక్తి అదృశ్యం

జిన్నారం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మతిస్థితిమితం లేని వ్యక్తి అదృశ్యమయ్యాడు. గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామానికి చెందిన అంబయ్య 10న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువుల, సమీప ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో అంబయ్య వదిన వినోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలి


హవేళిఘణపూర్‌లోని గురుకుల పాఠశాల్లో భోజనాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


రామచంద్రాపురం: పదో తరగతి విద్యార్థి పుస్తకాలు పరీక్షిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల స్టోర్‌రూంలోని కూరగాయలు, బియ్యం బస్తాలు, గుడ్ల నాణ్యత, ఉపాధ్యాయుల హాజరు, సరుకులు, అకౌంట్స్, సరుకుల నిల్వ రిజిష్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ తనిఖీల్లో ప్రిన్సిపాల్ సృజన, ఉపాధ్యాయులున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదికిపది జీపీఏ గ్రేడ్లు సాధించే విధంగా శ్రమించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం రామచంద్రాపురం మండలంలోని వెలిమెల మోడల్ స్కూల్, ఉస్మాన్‌నగర్‌లోని కస్తూర్బా పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న వేళ ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని పదో తరగతి విద్యార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సమయం తక్కువగా ఉన్నదని, విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో డైనింగ్ హాల్, విద్యార్థుల బట్టలు ఉతకడానికి ఒక ధోబిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సంగ్రాంరెడ్డి, ఎంఈవో రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'

కోహీర్, ఫిబ్రవరి 22: (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపైన పూర్తి అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరీ కృష్ణ అన్నారు. శనివారం కోహీర్ మండలంలోని పీచేర్యాగడి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పాండురంగా రెడ్డి, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మలింగేశ్వరస్వామి ప్రాణ ప్రతిష్ఠలో మాజీ ఎంపీ


ఆత్మలింగేశ్వరస్వామి ప్రతిష్ఠ మహోత్సవాల్లో మాజీ ఎంపీ బీబీపాటిల్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేట మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామంలో నిర్మిస్తున్న ఆత్మలింగేశ్వరస్వామి శివాలయ ప్రాణ ప్రతిష్ఠలో మాజీ ఎంపీ బీబీపాటిల్, బీచ్కుంద మహరాజ్, దుద్యాల పీఠాధిపతి సర్వేశ్వర్‌మహరాజ్, బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరిమహరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్, ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుల్‌కల్/అల్లాదుర్గం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం చౌటకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు శనివారం పరిశీలించారు. ఉమ్మడి నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు 27న జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలను చౌటకూర్‌లో ఏర్పాటు చేయడంతో పాఠశాలలో మౌలిక వసతులు, ఓటింగ్ గదులు, విద్యుత్ సౌకర్యాలపై ఆరా తీశారు. పోలింగ్ సిబ్బందికి మరుగుదొడ్లు, తాగునీరు సౌకర్యాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులున్నారు. అలాగే అల్లాదుర్గంలోని పోలింగ్ కేంద్రాన్ని మెదక్ ఆర్డీవో రమాదేవి పరిశీలించారు. ఈమె వెంట స్థానిక తహసీల్దార్ మల్లయ్య, ఆర్ఐ శరణప్ప, రాజు ఉన్నారు. అలాగే అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

వెండికోలులో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

- మూడునెలలుగా వృథాగా మంజీరా జలాలు
- పట్టించుకోని అధికారులు


వెండికోలు శివారులో పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పారుతున్న మంజీరా జలాలు

పుల్‌కల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం వెండికోలు గ్రామంలో మంజీరా పైల్‌లైన్ లీకేజీ కావడంతో జలాలు వృథాగా పోతున్నాయి. వేసవికాలం సమీపిస్తున్న తరుణంలో ఒక్కో నీటి చుక్కను ఒడిసి పట్టాల్సిన సంబంధితశాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నర్సాపూర్, గజ్వేల్, తూప్రాన్ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాలకు చౌటకూర్ మండలం చక్రియాల గ్రామ శివారులో మంజీరా రిజర్వాయర్‌లో ఇన్‌టెక్ వెల్‌ను నిర్మించారు. అక్కడి నుంచి హత్నూర మండలం బోర్పట్ల గ్రామ శివారులోని నీటి శుద్ధి కేంద్రం వరకు భారీ పైప్‌లైన్‌ను ఏర్పాటుచేసి జలాలను సరఫరా చేస్తున్నారు. అయితే వెండికోలు గ్రామ శివారులో మూడునెలల క్రితం ఈ పైప్‌లైన్ లీకేజీ కావడంతో మంజీరా జలాలు వృథాగా పొలాలకు పారుతున్నాయి. పైప్‌లైన్‌కు రంధ్రం పడి నీళ్లు వృథాగా పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ దారి బురదమయం కావడంతో ఆ ప్రాంతాల్లోని వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు చేపట్టాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

రిజర్వేషన్లు అమలుచేశాకే ఎన్నికలకు వెళ్లాలి : పాండు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్, నగరపాలక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తమిళనాడు తరహాలో రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపరిస్తే రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ యువత జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, సంఘం నాయకులు పాల్గొన్నారు.


రుక్మాపూర్‌లో బంతిపూల సాగు

రైతుల 'పూల'బాట

5వ పేజీ తరువాయి

ఇంతే ఖర్చవుతుంది. కానీ, నీటి తడులు ఎక్కువగా అవసరం కావడంతో నీటి వసతి ఉన్నచోటనే చామంతి తోటలు సాగు చేస్తున్నారు.

డిమాండ్‌ను బట్టి లాభాలు

సీజన్‌ను బట్టి పూల తోటల సాగులో రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. పండుగలు, పెళ్లిల సీజన్‌లో పూల మంచి డిమాండ్ ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆయా సమయాల్లో కాపుకు వచ్చేలా రైతులు పూల తోటలను సాగు చేస్తున్నారు. గతంలో పూలను హైదరాబాద్ మార్కెట్ నుంచి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం వ్యాపారులే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తున్నారు. పండుగల సీజన్‌లో రైతులే నేరుగా తీసుకువచ్చి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు.

కూరగాయల సాగుకంటే లాభదాయకం



గతంలో కూరగాయలు సాగుచేసి నష్టపోయాం. ధరలు ఎక్కువగా ఉన్నాయని టమాటా, వంకాయ సాగు చేస్తే పంట చేతికి వచ్చే సమయానికి ధర పడిపోయేది. పూల తోటల సాగుతో కష్టాలు తీరాయి. కూరగాయల కంటే ఎక్కువ లాభాలు వస్తున్నాయి.

- తలారి రాములు, రుక్మాపూర్

రెండోరోజు 'సెయింట్ ఆంథోనీస్' రజతోత్సవాలు


రజతోత్సవాల్లో నవీష్‌హనుమంతరెడ్డి, సల్‌మోన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ 25 వసంతాల రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండోరోజైన శనివారం ఏరోనాటికల్ అండ్ ఏరో స్పేస్ ఇంజనీరింగ్ ఫౌండర్ నవీష్‌మనుమంతరెడ్డి, కార్మెల్ హైస్కూల్ చింతల్‌చెరువు ప్రిన్సిపాల్ మరియానందిరెడ్డి, ఫాదర్ అమల్ ఫ్రాన్సెస్ ముఖ్యఅతిథులుగా హాజరై విద్యా గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత పాములమ్మ సలోమోన్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, హెచ్ఎం అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జయబాలరెడ్డి, పాఠశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జవహర్, అడ్వైజర్ డా.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకిచ్చిన హామీలు అమలు చేయాలి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. తమకు మీ జాలీ, దయ, కరుణ అవసరం లేదని తమ హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పించాలని పోరాటం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాంచందర్ పాల్గొన్నారు.

పరీక్షలు అంటే భయం వద్దు: లోకనాథం

హత్నూర, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా పట్టుదలతో చదవాలని మోటివేషనల్ స్పీకర్ లోకనాథం సూచించారు. మండల పరిధిలోని బోర్పట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థులకు సీక్రెట్ ఆఫ్ సక్సెస్, టైం మేనేజ్‌మెంట్, మెమొరీ టెక్నిక్స్, గోల్ సెట్టింగ్ తదితర అంశాలు గురించి ప్రేరణ కల్గిస్తూ... సరైన ప్రణాళికతో చదివితే మంచి మార్కులు తెచ్చుకోవచ్చని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

32 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు


కంటి శస్త్ర చికిత్సలు చేయించుకొని ఖేడ్‌కు వచ్చిన బాధితులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ ప్రాంతానికి చెందిన 32 మంది హైదరాబాద్‌లో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేయించుకొని శనివారం ఖేడ్‌కు తిరిగివచ్చారు. ఈ నెల 20న శ్రీసత్యసాయి సేవాసమితి, హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 127 మంది హాజరుకాగా.. అందులో 51 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారిలో 48 మందిని శంకర ఆసుపత్రికి తీసుకెళ్లి.. 32 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించి ఖేడ్‌కు తీసుకొచ్చారు. మిగిలిన వారికి ఆదివారం తీసుకురానున్నట్లు సత్యసాయి సేవాసమితి జిల్లా కన్వీనర్ శంకరప్ప తెలిపారు.

వేతనాల కోసం జీపీ కార్మికుల భిక్షాటన


ముత్యాలమ్మ గుడి ఎదుట భిక్షాటన చేస్తున్న జీపీ మండల కార్మికులు

మనోహరాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తమకు వేతనాలు చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మికులు శనివారం చెవిలో పువ్వులు పెట్టుకుని భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడునెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ శివరాత్రికి ఏడుపాయల్లో జరిగే జాతరకు కార్మికులు రావాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికులు అంజయ్య, స్వామి, శోభ, అర్జున్ రాములు, బలమని, సూరి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

అల్లాదుర్గం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి నెలకొనకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అల్లాదుర్గం గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో చెడిపోయిన పలు చేతిపంపులను పరిశీలించారు. పట్టణంలోని పలు కాలనీల్లో చెడిపోయిన చేతిపంపులు, బోరు మోటార్లకు మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా మూడు కొత్త బోర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు.